


ఆ మేడ...తెలుగు సినిమాలో రావణాసురుడి నకిలీ రత్నకిరీటంలా ఠీవిగా దర్పంగా నిలుచున్న ఆ నాలుగంతస్థుల మేడ...అడివయ్యగారనే ఐశ్వర్యవంతుడిది. అడివయ్యకి ఆరుగురు మొగపిల్లలూ, ఓ ఆడకుక్కా—యివీ సంతానం. ఐశ్వర్యవంతులకీ, ఆఫీసర్లకీ అందమైన పేర్లుండవనే సిద్ధాంతం అడివయ్యపట్ల అతి నిజం. (ఈ సిద్ధాంతానికి కాన్వర్స్ నిజమని భ్రమపడి—అందమైన పేర్లున్నవాళ్లు బాధపడిపోనవసరంలేదు) అడివయ్య అచ్చంగా అమ్మాయికిమల్లే పెంచుకుంటున్న ఆడకుక్క రెండునెలల క్రితం కన్న నాలుగుపిల్లలలోనూ మిగిలింది వొకే వొక్క కుక్కపిల్ల. డబ్బున్నవాళ్ళ పిల్లలకే కాకుండా కుక్కపిల్లలకుకూడా డిమాండేకనుక అడివయ్యవంటి అదృష్టం పడుతుందేమో అని ఒకరూ, అతనికిమల్లే మగపిల్లలు పుడతారేమో అనే ఆశతో ఒకరూ—యిలా మూడుకుక్కపిల్ల

లని పెంపకానికి తీసుకుపోయారు. లేని వారి మనిషిపిల్లలకంటె కలవారి కుక్క పిల్లలు గొప్ప. ఏతావాతా అడివయ్యకు మిగిలిన మనవరాలు ఒక్కతే. ఆ కుక్క పిల్లకి యిప్పుడిప్పుడే బొచ్చు మొలు స్తూంది. ఆ బొచ్చుని చూసుకుంటూంటే దానిలో గర్వం మొలుస్తూంది. బొచ్చు కుక్కపిల్ల బొచ్చు – బొచ్చుకుక్కపిల్లకి ముద్దు కావడంలో అసహజం ఏముంది? రావణాసురుడికిరీటం మేడపక్కన చిన్న డాబా – అనంతరావనే అందమైన పేరు కలవాడిది. పేరేతప్ప రేఖ బాగులేని అనంతరావ్‌కి ఆరుగు రాడపిల్లలూ, ఓ మొగపిల్లీ–యివీ సంతానం. ఇవే అతని దురదృష్టానికి నిదర్శనాలు. ఇళ్ళయితే ప్రక్క ప్రక్కన ఉండగలిగాయికానీ మనుషు లుండలేరు. అడివయ్యలాటి ఐశ్వర్యవంతుడి పక్కన ఆఫ్టరాల్ అనంతరావ్, ఆరుగురాడపిల్లల ఫాదర్! అనంతరావ్ ఆరవ అమ్మాయి అరుంధతి లేదూ? ... ఆ పిల్ల రోజూ ఉదయం, సాయంత్రం అడివయ్యగారింటికి వస్తూం టుంది–ఆ బొచ్చుకుక్కపిల్లకోసం. ఆ మేడ దాటి కొంచెం ముందుకి...యిరవై గజాలు నడిస్తే ఎడంవేపుకో మలుపుంది. మలుపు తిరిగి మరో పదిగజాలు నడిస్తే కుడిచేతి ప్రక్కకు ఓ చిన్న బిల్డింగుంది. ప్రభుత్వ కార్యాలయం అది. పట్టి చూస్తేతప్ప ఆ బోర్డుమీ దేముందో అర్థంకాదు. స్పష్టంగా కనిపించని ఆ ఆఫీసులో – ఆఫీసరునుంచి అటెండరువరకూ ఎవరికీ ఎంత వెదికినా చేసేందుకు పనీ కనిపించదు. నెలకోసారి జీతం తీసుకునే పనితప్ప. ప్రభుత్వ కార్యాలయాల సహారా ఎడారులలో అరు దుగా మిగిలిపోయిన ఎండమావిది. ఈ ఆఫీసులోనే ఉంటున్నాడో అబ్బాయి. అతనికీ పనిలేదు. అతను పిల్లిబుర్ర గొరగడంలేదు. కారణం యింటావంటా లేనిదది. వృత్తికానీ కులంకానీ అబ్బాయి దాకరహాకి సంబంధించినదికాదు. పనిలేని అబ్బాయి కాగితాలు బరికేయడం నేర్చు కున్నాడు. ఆరునెలలకిందట అమాంతం రెండువందల పేజీలు బరికేసి – పనిలేని గుమాస్తా కాగితాలు బరికి రచయిత కావచ్చునని లోకంలో కొంత భాగానికి చాటేడు.

కాలేజీ వదలగానే ఆఫీసులోకి లాక్కొన బడినవాడూ, అక్కడ అందరిలోకీ చిన్న వాడూ కనుక వాళ్ళంతా అతన్ని అబ్బా యంటారు – అతని ఆబ్‌సెన్సులో. ఆఫీ సులో ... ఆఫీసు టైములో ... ఆఫీసు కాగితాలతోనే అతనా రెండువందల పేజీలూ రాశాడు. రాసింది ఆఫీసులో అయినా రాసింది ఆఫీసుగురించి కాదు. నిజానికా ఆఫీసుగురించి రెండువందల పేజీలు రాయగల్గితే అతని కీపాటికి పద్మశ్రీ వచ్చేసేది. తను వదలివచ్చిన (రాదర్...తనను వదిలేసిన) కాలేజీ గురించి ... ఆ జీవితంలోని స్వీట్ మూమెంట్స్–సమ్మెలగురించి;కాలేజీఅవ

రణలో అటూయిటూ తిరిగే అందమైన అమ్మాయిలగురించి; ఆకతాయిగా ప్రవర్తించే కుర్రలెక్చరర్ల ప్రేమాయణాల గురించి; – ఇవన్నీ కలిపిరాసి ఓ నవల చేశాడు. కాలేజీ వదిలేశాక తప్ప దాని విధులూ బాధ్యతలూ తెలిసిరాలేదా అబ్బాయికి. (చాలామంది అబ్బాయిలకు కాలేజీ వదిలేశాకనే అదంటే ఏమిటో ఎందుకో అర్థమౌతుంది.) బాధ్యతుందని గుర్తించిన అబ్బాయి – బాధ్యతకల లెక్చరర్‌ని సృష్టించాడు. (నిజంగా సృష్టే!) వాళ్ళ ప్రిన్సిపాల్ డిఫాక్టోకనుక నవలలో ప్రిన్సిపాలూ చవటే. అబ్బాయి కాలోచనలూ ఆదర్శాలూ మొదలౌతున్నాయి కనుక నవలలో హీరోకే అవి ఆపాదించాడు. క్లాస్‌మేట్ శారదంటే అబ్బాయికి చాలా యిష్టంకనుక తను రాసే నవలలో ఆమెని హీరోయిన్ చేశాడు. అతనికి ప్రేమంటే ప్రేమకనుక కథలో ఎటర్నల్ ట్రయాంగిల్ ఏర్పరిచాడు. ఇన్నిచేసినా అది నవలే అయిందనేందుకు కారణం – తృణమో పణమో యిస్తానని చెప్పి ఓ పబ్లిషరు దాన్ని అచ్చువేయడం. అందరు పబ్లిషర్లలాగానే ఆ పబ్లిషరూ యువరచయిత అబ్బాయికి తృణమే యిచ్చాడు. అడివయ్యగారికి ... సారీ ... అడివయ్యగారి కుక్కకి కుక్కపిల్ల పుట్టిననాడే (ఈ శతాబ్దంలో అటువంటివికూడా చెప్పడం మంచిది) అబ్బాయిచేతికి అచ్చు పుస్తకాలుఅందాయి. పబ్లిషరు వాటినితృణంగానే పంపాడు కానీ అబ్బాయిమాత్రం వాటిని పణంగానే స్వీకరించాడు. అందుకే అతని కానందం ముంచుకొచ్చింది. గర్వం పొంగింది. నేను రచయితని అనుకున్నాడు తనలో తనే. ఆ క్షణాలలోనే సాహిత్యప్రపంచాన్ని తన రచనలతో సుశోభితం చేస్తాననీ–సోషల్ రిఫార్మ్స్ తెచ్చేస్తాననీ అనేసుకున్నాడు. ప్రపంచాన్ని ఉద్ధరించేందుకు కంకణం బిగించుకున్నాడు గట్టిగా. (అబ్బాయి చేతికి వాచీయే ఉంది. కంకణం లేదు. వాచీ గొలుసు బిగించుకున్నాడంటే వాస్తవాలంకారం అవుతుంది.)

కాలేజీలకు సంబంధించిన విషయం కనుక పాఠకులలో కొందరు ఆ నవలని బాగానే రిసీవ్ చేసుకోసాగారు. పబ్లిషర్‌కి లైబ్రరీలతో సత్సంబంధాలున్నాయి కనుక నవల పాఠకులని బాగానే రిసీవ్ చేసుకుంటూంది. మన దేశంలో గ్రంథాలయాలూ – నిరుద్యోగులూ ఎక్కువే కనుక కొంతమంది కాలక్షేపం కోసం అయినా చదువుతున్నారు. అలా చదివేవాళ్ళలో పనిలేనివాళ్ళూ–రచయిత లౌదామని అపలేనివాళ్ళూ అధికం కనుక నవలగురించి ఉత్తరాలూ రాస్తున్నారు.

విద్యార్థులు మెచ్చుకుంటున్నారు – లెక్చరర్లని నవలలో తిట్టినందుకు. లెక్చరర్లు తిడుతున్నారు – తమ గురించి కొన్ని నిజాలు రాసినందుకు.

"మీ నవల యదార్థానికి ప్రతిబింబం. మా కాలేజీలో జరిగిన సంఘటన లెన్నో మీ నవలలో చిత్రీకరించారు."

"మీ నవలలో ప్రిన్సిపాలూ – మా ప్రిన్సిపాలులాగే ఒట్టిచవట. నవల చాలా బాగుంది ఆయన కో కాపీ యిచ్చాం చదివి బాగుపడతాడేమో అని."

"లెక్చరర్ల ప్రేమాయణాలు బాగా రాశారు వాళ్ళ కుళ్ళునీ, పాలిటిక్స్‌నీ వెలికిలాగి చూపేరు ఇది చదివైనా బుద్ధి తెచ్చుకుంటారేమో అని లైబ్రరీకి కాపీలు డొనేట్ చేశాం."

"నేటి విద్యాభ్యాసంలో, విద్యాలయాలలో లోపాలను బాగా ఎత్తిచూపారు. నిష్పక్షపాతంగా చెప్పాలంటే మీది మంచి రచన."

"మిమ్మల్ని మెచ్చుకుందుకు మాటలు చాలడం లేదు."

కృతజ్ఞతలు తెలిపేందుకు ఖర్చు బాగానే అయిందబ్బాయికి. కేవలం అభినందనల లేఖలకోసం ఆఫీసునుంచి ఫైలు తీసుకున్నాడు. లెక్చరర్లు తిడుతూ రాసిన ఉత్తరాలని మరిచిపోయి–అభినందనలను మాత్రం మనసులో నిలవుంచుకున్నాడు. ఏకాంతంలో అభినందన లేఖలను చూసుకుని గర్వపడుతూ మరో నవలకి బృహత్ప్రణాళిక వేసుకుంటున్నాడు. మధ్యాహ్నం భోంచేసి – కిళ్లీ వేసుకుని – సిగిరెట్ కాలుస్తూ – లాల్చీ పైజమాల్లో రచయిత తాలూకు భౌతికకాయం రావణాసురుడి మేడ దాటుతూంది. అతని కీ క్షణాలలో మెదడులేదు. నవల ప్లాటుకోసం అన్వేషణకు పోయిందతన్ని వదిలి. సరిగ్గా అతనా మేడదాటుతూంటే కథానాయకి బొచ్చుకుక్కపిల్ల ఆర్తనాదం చేస్తూంది. కాని – కుక్కపిల్ల అరుపు అతనిలో చలం కలిగించలేకపోయింది. అలాగే యాంత్రికంగా నడచి – ఆఫీసు చేరుకుని–కుర్చీలో కూలబడబోతుంటే...

"చూడబ్బాయీ..."అని నాలిక్కరిచేసుకుని "చూడు రచయితా" అని తనను తానే కరక్ట్ చేసుకున్నాడు పరమేశ్వరం.

పరమేశ్వరం ఒకప్పుడు మేసేగాడిదే. పనిలేకపోయినా ఏ టిఫినో తెప్పించుకుని ఆరారగా తింటూ కుర్చీలోపడి కునుకు తీస్తూ ఆఫీసుటైము హాయిగా గడిపేవాడు. కాని...అబ్బాయి...అదే...రాసేగాడిద వచ్చి మేసేగాడిదని చెడగొట్టింది. (ఈ రాసేగాడిద క్షమార్హుడు) అబ్బాయి రాసేగాడిదగా మారుతూ – సుఖం మేసేగాడిదను చెడగొట్టడం మొదలుపెట్టాడు. రచయిత ఒకడు ఆఫీసులో ఉంటే చాలు – అమాయకులెవరూ సుఖపడలేరక్కడ. రచనా వ్యాధిపీడితుడు తన రోగాన్ని వ్యాప్తి చెయ్యడు స్వార్థం కొద్దీ. కాని...యీ వ్యాధిపీడితుడు చుట్టు పక్కలవారిని దుఃఖపెట్టేస్తాడు. ఆ బాధలు అమాయకులకీ మంచివారికీ

అంటే తీరుతాడు. సరిగ్గా యిదే జరిగింది పరమేశ్వరం విషయంలో.

అబ్బాయి నవల వ్రాయడం మొదలు పెట్టేవరకూ పరమేశ్వరానికి పత్రికంటే దినపత్రికగానే తెలుసు. వారపత్రికలుంటాయనీ, వాటిలో కథలుంటాయనీ, వాటిలో అవకతవక ప్రేమలూ గట్రా ఉంటాయనీ తెలియదు. ఈ విచిత్ర పత్రికా ప్రపంచం గురించి అజ్ఞానిగా ఉంటూ హాయిగా సుఖపడుతూండే పరమేశ్వరంచేత పట్టుబట్టి పత్రికలు చదివించడం మొదలుపెట్టాడు అబ్బాయి. నానాగడ్డీ అందించి చదవమని ఊరుకోడం మానేసి – అభిప్రాయాలడిగేవాడబ్బాయి. అప్పుడప్పుడు ప్రతిఫలంగా లభించే కాఫీటిఫెన్లకోసం కక్కుర్తిపడి పోయేవాడు పరమేశ్వరం. పాలకోసం రాళ్ళు మోసినట్లు కాఫీకోసం కథలు చదివేవాడు. అనకూడదుకానీ యీవ్యాధి క్షయకంటే ఘోరం. చదవడం మొదలు పెడితే ఆ మనిషి చివరకెక్కడ తేలుతాడో చెప్పడం కష్టం. ఉత్తరాలు రాసేవాడిగానో, కథల్రాసేవాడిగానో అయిపోతే ఫరవాలేదు కానీ కథలుచదవడం అనే ఊబిలోనే ఉండిపోతే...చెప్పలేం. ఇంకా పరమేశ్వరం పత్రికా పఠనపు ఊబిలోనే ఉండిపోయాడు. అతనెంత పతనమైపోయాడంటే – ప్రస్తుతం పత్రిక కోసం షాపుకి పరిగెత్తి వచ్చాడు. పరుగెడుతూనే పేజీలు తిప్పేస్తున్నాడు. ఆ కళ్ళు గారడీలాగా పరుగెడుతూనే చదవ గలిగేస్తున్నాయి. ఇప్పుడతని చేతిలో తాజాపత్రిక ఉంది. రెండు పేజీలనడుమ అతని కళ్ళు అంటుకుపోయి ఉన్నాయి.

"ఘోరం! అన్యాయం...అక్రమం" అరిచాడతను నిన్ననే చదివిన ఓ కథలోని పాత్రలా. "దీన్ని సహించడానికి వీల్లేదు."

"ఏం జరిగింది?" అమాయకంగా అడిగాడబ్బాయి–నల్లనివన్నీ అక్షరాలూ, తెల్లనివన్నీ కాగితాలూ అనుకునే రచయిత అబ్బాయి.

"నా నోటితో...ప్చ్...వొద్దు..." పత్రిక అందించాడు పరమేశ్వరం. ఆ పేరు చూసేసరికి అబ్బాయి గుండెలు ఒక్క–క్షణంపాటు ఆగిపోయి – అప్పుడు మళ్ళీ కొట్టుకోవడం మొదలుపెట్టాయి. శరీరం చెమట క్రమ్మింది. పెదవులదర సాగేయి. ఇటువంటి వివిధ స్థాయీ భావాలూ సంచారీభావాలూ చాలా అయి–తెప్పరిల్లాక మళ్ళీ పత్రికలోకి చూశాడు గుండె దిటవుచేసుకుని.

"వొద్దు...నువ్వు చూడలేవు, చదవలేవు, భరించలేవు–" అంటూ పరమేశ్వరం అబ్బాయి చేతిలోనుంచి పత్రిక తీసుకుని– "నే నెలాగో చదువుతాను విను. భరించు," అంటూ మొదలు పెట్టాడు.

ఆత్రుతగా చూస్తున్నాడబ్బాయి. ఆందోళన ఒక కంట్లోనూ, అపరిమిత

మైన భయం రెండోకంటిలోనూ నిండి పోయాయి.

"విజయవాడవంటి పట్నంలో శత దినోత్సవం చేసుకునే తెలుగు సినిమా హీరోకి ప్రతిబింబం యీ నవలలోని హీరో. అన్ని మంచిగుణాలూ అతనికే ఉంటాయ్. అత్యంత అవాస్తవికమైన పాత్ర..." చదవడం ఆపి స్వంత అభిప్రాయం ప్రకటించాడు పరమేశ్వరం— "మంచిగుణాలున్న మగవాళ్ళు అవాస్తవికమా? హీరోలో మంచిగుణాలుండకూడదా?"

"ముందు చదువ్."

"కథా పథకం లో పభూయిష్టం. రచన బాల్యావస్థకి ప్రతిబింబం..." మళ్ళీ ఆగిపోయాడు పరమేశ్వరం. "మిస్టర్ రచయితా! ఇది నా ప్రిస్టేజ్ క్వెశ్చన్. కథా పథకం లోపభూయిష్టమైతే నేను నీ నవలని సజావుగా ఎలా చదువుకోగలను! ఏ సంఘటనా ముందువెనుకలైనట్లు తోచలేదు. మరి...అసలు కథా పథకం అంటే ఏమిటి?"

అబ్బాయికీ ఏమీ అర్థం కాలేదు.

"రచన బాల్యావస్థకి ప్రతిబింబం! ఈ ముక్కకి ఏమిటర్థం? ఇది నీ తొలి నవల కనుక బాల్య రచన అనా? ఈ లెక్కన ఏభైనాలుగో నవలనుంచి వృద్ధ నవల అవుతుందా? లేకపోతే...కాలేజీ కుర్రాళ్ళ గురించి రాసినందువల్ల బాల్యావస్థ అయిందా రచన? ఏమిటీ ప్రయోగం?"

అబ్బాయి పెదవులు తడి ఆరిపోయాయ్. చెప్పడానికేమీతోచడంలేదు. ఏమైనా చెప్పదల్చుకున్నా పెదవులు విడేటట్లు లేక మెల్లగా తల ఊపాడు చదవమన్నట్లు.

"ప్రతి పాత్రా తెలుగు సినిమాలో పాత్రే. నవలలోనూ ఓ సబ్ ప్లాటుంది. విలనున్నాడు, కమేడియనున్నాడు. వట్టి రొమాంటిక్ ఫిక్షన్. అంతా సినిమాతనమూ, తెలుగు సినిమాతనమూను. చివరకు పాత్రలుకూడా సినిమాలోలాగే మాట్లాడుతాయ్. ఎంత వెతికినా వాస్తవికత మచ్చుకైనా కనిపించదు. నవల చదువుతూంటే తెలుగు సినిమా చూసినట్లే ఉంటుంది. శైలినుంచి టెక్నిక్ వరకూ, సంభాషణలనుంచి పాత్ర చిత్రణవరకూ వట్టి తెలుగు సినిమా. దీన్ని రాసిన రచయితా, అచ్చువేసిన పబ్లిషర్సూ..."

కొంచెం ఆగి అన్నాడు పరమేశ్వరం "చదివిన వాళ్ళనుకూడా మూర్ఖులనలేదు. నయమే."

అబ్బాయి తల దెబ్బ తగిలించుకోకుండా టేబులుమీదకు ఒరిగిపోయింది. పరమేశ్వరం జాలిపడి, అబ్బాయి ఖర్చుతోనే రెండు కూల్‌డ్రింకులు తెప్పించి ఒకటి అతనిచేత తాగించాడు. పావుగంట పోయాక తెప్పరిల్లాడు అబ్బాయి.

"నా నవలమీద విమర్శ — నిజమేనా? నీకూ అలాగే అనిపిస్తూందా?"

"లేదు." కుండ బద్దలయినట్లు ఇచ్చి



తంగా అన్నాడు పరమేశ్వరం. కేవలం అబ్బాయిని సముదాయించడానికి సానుభూతి చూపలేదతను. అందులో ఆత్మరక్షణా ప్రయత్నమూ ఉంది. అబ్బాయి నవల నతను హృదయపూర్వకంగానే బాగుందని అంగీకరించాడు. మనస్ఫూర్తిగానే అభినందించాడు ఆత్మవంచనా పరస్తుతీ చేయకుండా. అద్భుతం కాకపోయినా బాగానే ఉందనిపించిం దబ్బాయి నవల. దాన్ని యీ విమర్శకులు అంత చవకబారుగా తీసిపారేస్తూంటే పరమేశ్వరానికీ పౌరుషం వచ్చింది. "అబ్బాయ్... నవల బాగా రాశాడీ కుర్రవాడని యీర్ష్య పడి విమర్శించినట్లుందికానీ, న్యాయమైన విమర్శలా లేదు. అసలీ విమర్శకుడికి విమర్శ అంటే ఏమిటో తెలిసినట్లు లేదు. విమర్శ అంటే తిట్టడమే కాబోలనే అపోహలో ఉన్నట్లుంది. చూడగా యీ విమర్శక మహాశయులకు నీ నవల చదవడమూ అర్థం చేసుకోవడమూ చేతకాలేదని స్పష్టమౌతూంది. నాకే అర్థమైన నవల — విమర్శకుల కర్థంకాలేదా

అని అనుమానం కలుగుతోంది. నీకు వచ్చిన ఉత్తరాలలో, అభిప్రాయాలలో, ఎవరూ కథా పథకం సరిగా లేదనీ, అసహజంగా ఉందనీ ఎవరూ అనలేదు కదూ? చూడగా సామాన్య పాఠకుడి కంటె అధమస్థితిలో ఉన్నట్లుంది విమర్శకు...డు...కాదు... విమర్శకురాలు! అరె!... ఈ అగ్గిపుల్ల ఆడ అగ్గిపుల్ల! తెలిసిపోయింది. ఈవిడగా రెప్పుడూ కాలేజీ ముఖం చూడలేదు. గురుర్బ్రహ్మ గురుర్విష్ణుః గురుర్దేవో మహేశ్వరః నాటి ఛాందస భావాల నంటిపెట్టుకున్న అమ్మమ్మ. నేటి కాలేజీల గురించీ, విద్యార్థుల గురించీ, అధ్యాపకుల గురించీ యీావిడకు తెలిసింది శూన్యం. ఈమె గారికి తెలిసిన దొక్కటే - పత్రికలవాళ్ళు విమర్శ వ్రాయమన్నారని అవాకులూ, చవాకులూ అసభ్యంగా వ్రాయడం! మిస్టర్ నేను నిజం చెబుతున్నాను. నీ రచన మహాద్భుతం కాకపోవచ్చు. కాని... అంత తీసిపారెయ్యవలసింది కాదు. అది మాత్రం కటిక నిజం. నువ్వు బాధపడకు. ఆఫ్టరాల్ ఓ ఆడ అగ్గిపుల్ల కాదన్నంత మాత్రాన నీకూ నీ నవలకూ వచ్చిన ప్రమాదమూ లోటూ ఏమీలేవు."

"ఆడ అగ్గిపుల్ల కాదు, మొగవాడే. సాధారణంగా విమర్శకులు నిజ నామధేయాలతో విమర్శలు వ్రాయరు. పెన్ నేమ్."

"అయితే యిది ఆడపిల్ల పేరుతో మొగవాడు వ్రాసిన విమర్శ అన్నమాట. బాగుంది. ఇంతకీ విమర్శ అంటే ఏమిటి?"

అబ్బాయి ఏమీ చెప్పలేకపోయాడు.

"విమర్శ అంటే రచయితను తిట్టడం అనేనా ఏమిటి?"

"కాదు." మెల్లగా అన్నాడు అబ్బాయి. "నిజానికి విమర్శ సాహిత్యాన్ని ప్రమోట్ చేసేదిగా ఉండాలికాని కిల్ చేసేదిగా ఉండకూడదు. రచయిత గుర్ర మనుకుంటే విమర్శ కళ్ళెం. ధ్యేయం సాహిత్యోద్ధరణ."

"విమర్శ అసభ్యంగానే ఉండాలా? రచయిత పొరపాటే వ్రాశాడనుకో. విమర్శకుడు స్థాయి దిగజార్చుకుని రచయితను తన యిష్టంవచ్చినట్లు గజిబెడాఫీసరు ఎల్.డి.సి ని మల్లె తిట్టిపారెయ్య వచ్చునా?"

"లేదు. సభ్యత, సున్నితమూ ఉండాలి. ఎటొచ్చీ ప్రస్తుత విమర్శకులు ఆకనీస సభ్యతా సూత్రాలను విస్మరించారు."

"అసలీ విమర్శకుడి కింత అధికారం ఎవరిచ్చారు?"

"రచయితలే. సాహితీ ప్రపంచంలో మంచి చెడ్డలను చూడమని విమర్శకుల నేర్పరిచారు రచయితలూ, పత్రికలూ. ఎటొచ్చీ విమర్శకులు - విమర్శకుండే ప్రాథమిక లక్షణాలనుకూడా విస్మరించి..."

"డెమోక్రసీనుంచి డెస్పాటిజమ్‌కు



యువ

మారిపోయారన్నమాట! బలే బాగుంది. రచయిత కావడంకంటె విమర్శకుడై పో తేనే నయం. ఇష్టం లేనివా శ్ళందర్నీ తిడుతూ, నోటి దురదా, కలం దురదా తీర్చుకోవచ్చు. బైదిబై-యీ అగ్గిపుల్లలకు స్వయంప్రకాశం అంటే స్వతంత్రంగా రచించగలిగే ప్రతిభ ఉంటుందా?"

"అరుదుగా ఉంటారు అటువంటి వారు. ఒకరిద్దరు మంచి విమర్శకులూ ఉన్నారు..."

"ఏమో! ఈ విమర్శలో నాకేమీ న్యాయమూ, సహజత్వమూ కనిపించడం లేదు."

ఆఫీసు ఖాళీపోయింది. ఇద్దరూ బయటపడి రావణాసురుడి మేడవరకూ వచ్చేసరికి...

కుర్రవా - కుక్కపిల్ల బొచ్చులాగు తూంది. అది అరచి గీ పెడుతూంది బాధతో. అదొక ఆటగా ఉన్నట్లుంది కుర్రదానికి. పిల్లికి చెలగాటం, ఎలక్కి ప్రాణసంకటం అన్నట్లూ; విమర్శకుడికి వేళాకోళమూ రచయితకి రచనా సంకటమూ అనదగేటట్లూ ఉంది అబ్బాయి పరిస్థితి.

ఆ రాత్రి అబ్బాయికి నిద్రపట్టలేదు. జ్వరం వచ్చినట్లు వళ్లు పేలిపోతూంది. తను సిన్సియర్‌గా కష్టపడి నిర్మించుకున్న కీర్తిసౌధాన్ని, విమర్శకరాక్షసుడు వికటాట్టహాసాంతో కూలద్రోస్తున్నట్లు పీడకలలు వస్తూ కలతనిద్ర అయిపోయింది. తన ఊహాలని సమూలంగా నాశనం చేసేశాడు విమర్శక దుర్మార్గుడు. ఆశలనీ ఆశయాలనీ అధఃపాతాళానికణగ ద్రొక్కేడు క్రిటిక్ దుష్టుడు. మహారచయిత కాబోతున్న తనను సర్వనాశనం చేశాడు. ఇక తను ఏం రాసినా ఎవరూ అచ్చేసుకోరు. సాహిత్యవనాన్ని తన నవలా కుసుమంతో అలంకరించబోయి చివాట్లు తిన్నాడు తను. భగవాన్! తన ప్రాణాని కెక్కడ దాపురించాడీ విమర్శక విధ్వంసకుడు. తన పురోగమనానికి అడ్డు పుల్ల వేసిన - ఆటంబాంబు వేసిన యీ దౌర్భాగ్యు ణ్నేంచేస్తే పాపముంది? ఏం చేస్తే తీరుతుంది తన కసి? అబ్బాయిలో ఆవేశం అవధులు మీరింది. పళ్లు పటపట కొరుక్కోసాగాడు. కాలం గడుస్తున్నా ఏకాంతంలో జుత్తు పీకున్నాడు. అప్పుడప్పుడతని కన్నులు చెమర్చుతున్నాయ్. మనిషి కొన్నివేళల కోపంగా; కొన్నివేళల దీనంగా ఉంటున్నాడు. అప్పుడప్పుడు - జీవితంలో పూర్తిగా ఓడిపోయిన వాలకం ప్రదర్శిస్తున్నాడు.

వ్రాద్దామనుకున్న నవలని-శాశ్వతంగా వాయిదా వేసేశాడు. రూములో కాగిలమన్నది లేకుండా అన్నీ కుప్పవేసి తగలపెట్టాడు. ఇన్నిచేసినా అతని గుండెలు మండుతూనే ఉన్నాయి. హృదయంలో జ్వాలలు ఏమాత్రమూ ఆరలేదు.

పదిహేనురోజు లిలాగే గడిచాయ్.

అబ్బాయితో మాట్లాడటానికి పరమేశ్వరానికికూడా సాహసం చాలలేదు.

ఆఫీసుకి వారంరోజులు శలవుపెట్టాడు హఠాత్తుగా. అబ్బాయి మద్రాసు వెళ్తున్నాడని తెలిసి కంగారుపడిపోయాడు పరమేశ్వరం. విమర్శకుడి నివాసం మద్రాసులో అని గుర్తుకురాగానే మరింత కంగారుపడి ఏవోచెప్పాలని రైలుస్టేషన్‌కి పరుగెత్తాడు. కాని ... అప్పటికే రైలు కదిలిపోయింది.

* * *

"నమస్కారం. మీరు..."

"అవును నాయనా ... ఏం పనిమీద వచ్చావ్? కథలూగట్రా రాస్తూంటావా?" వాట్‌సిక్‌స్టీనైన్ గ్లాసులోకి వొంపుకుంటూ అడిగాడతను.

"లోగడ ఓ నవల రాసేనండి. అది మీరు విమర్శ..."

"చక్కగాచేస్తాను. నిన్ను అమాంతం ఆకాశానికెత్తేస్తాను. బుడ్డితెచ్చేవా?"

"క్షమించండి. మీ రప్పుడే దాన్ని విమర్శించేశారు."

"అలాగా! ...మరిచిపోయాను. ఏమిటి కథ?"

"ఇదుగో నా నవల, ఇది మీ విమర్శ, పోతే...యివి నాకు వచ్చిన అభినందనల లేఖలు. దయచేసి అన్నీ చూస్తే..."

"నాకంత ఓపికాలేదు, తీరుబడీలేదు." మరోపెగ్ రడీ చేసుకుంటున్నాడతను.

అబ్బాయి తెల్లబోయాడు.

"వెళ్లు వెళ్లు...మా ఆవిడ ఊరి కెళ్ళింది కదా అని స్వేచ్ఛగా నేను సుఖ పడుతూంటే నీ గోలేమిటి మధ్య?" కసురుకుంటున్నాడతను.

"వెళ్ళిపోతానండీ. కాని ... మీకు కృతజ్ఞతలు చెప్పుకునేందుకు అవకాశం యివ్వండి దయచేసి.

నేను నా నవలలో వాస్తవిక సంఘటనలే వ్రాశాను. కాలేజీలలో సామాన్యంగా జరుగుతున్న సంఘటనలనే తీసుకున్నాను ఎదురయ్యే మనుషులనే చిత్రించాను. మీరేమో అంతా వట్టి తెలుగు సినిమాలా ఉందని కొట్టిపారేశారు. రాయడం చేత కాదన్నారు..."


"అంటే అన్నానులే. అంత నవల చదివి విమర్శించడం ఎవరితరం? అయినా వేలెడులేవు, నీకు నవలలూ నాటకాలూ ఏమిటి? పోయి చదువుకుని బాగుపడు." మరోపెగ్ అందిస్తున్నాడు విమర్శకుడు.

"సార్...మీరు...సినిమా పాటలు రాయగలరా?" హఠాత్తుగా అడిగేడు అబ్బాయి.

"అదేమిటి? ఏమిటి నీ ప్రశ్న?"

"మీరు వ్రాసి యిస్తానంటే పాటకి వంద చొప్పున యిస్తాను. ఆరు పాటలు కావాలి..."

"కొంపదీసి నువ్వు సినిమా తీయబో



తున్నావేంటి?" కళ్లు పెద్దవిచేసిచూసేడు విమర్శకుడు. "కమాన్...నువ్వో ఓపెగ్ తీసుకో...చెప్పు.. సినిమా తీస్తున్నావా బంగారు పిచికా?"

"ఆ విషయం దేనికిలెండి చెప్పండి."

"సినిమాకని పాటలు రాసే ఉంచానోయ్. పాతికపైగా ఉన్నాయి. ఎటొచ్చీ ఎవడూ తీసుకోలేదు. తెస్తానుండు..."

"ఆగండి. నేను సినిమా తియ్యబోవడం లేదు. కాని ... ఓ సినిమాకి కథా మాటలూ నావే..."

"నిజమే?"

"ఇదుగో అగ్రిమెంటూ, చెక్కూ. కథకి పాటలూ నన్నే వ్రాయమన్నారు. అది నాకు చేతకాదు...నన్ను సినీ రైటర్‌ని చేసింది మీరు..."

"నేను చేశానా? ఏమిటండీ మీజోకు? సినిమాల్లో వేసే జోకు లిప్పుడే నామీద వెయ్యడం లేదుకద?"

"నిజంగా యిదంతా మీచలవే అంటే మీరు నమ్మలేరు. ఈ ప్రొడ్యూసర్ నా నవలనే సినిమా తియ్యబోతున్నాడు! నిజానికతను నా నవల చదవలేదు. ఓ సారి ఏమీతోచక తిరగేస్తూంటే నా నవలమీది మీ విమర్శ కనిపించిందట. అంతా విజయవంతమయిన తెలుగు సినిమా మాడల్‌లో ఉందంటూ నా నవల గురించి ఏకిసారేశారు మీరు."

“సారీ సార్! మీ రింత గొప్పవారనుకోలేదు ఇప్పుడు జ్ఞాపకం వస్తూంది. ఆవేళ...ఫారిన్ డ్రింక్ మాట దేముడెరుగు, కంట్రీ లిక్కరుకూడా కరువైపోయింది. మా ఆవిడ ఏదో వస్తువు తీసుక రాలేకపోయానని వేధించి వేధించి వదిలిపెట్టింది. ఎవడో తెలుగు సినిమాకి తీసుకెళ్ళి నా జేబులో డబ్బు కాళీ చేయించాడు. అటువంటి మూడ్‌లో నవల చదవడం సాధ్యమా? అందుకని స్థాలీపులాక న్యాయంగా అక్కడక్కడ పేజీలు తిప్పి విమర్శ వ్రాశాను. నిజం చెప్పేశాను. ఏమీ అనుకోకు. కొత్త రచయిత కదా అని అలా చేశాను ఇంకా నీ నవల లేమన్నా ఉంటే చెప్పు. అద్భుతమైన రచనలని పైకెత్తేస్తాను. జరిగింది మనసులో పెట్టుకోక క్షమిస్తావు కదూ?

ప్లీజ్, నీ సినిమాకి...అదేలే...... నువ్వు కథా, మాటలూ రాయబోయే సినిమాకి నా పాటలు తీసుకుంటావ్ కదూ?”

“ఇంత మేలు చేసిన మిమ్మల్ని మరిచిపోతానా? రేపు నా రూముకి మీ పాతిక పాటలూ పట్టుకురండి. నాకు నచ్చితే తీసుకుంటాను. రేటు మాత్రం పాటకి ఏభయ్యే. మీ కింకా సినిమాలలో ప్రవేశం లేదుగా? అందుకని!...” హుందాగా అడుగులు వేసుకుంటూ వెళ్ళిపోయాడబ్బాయి. అదే సమయానికి...

రావణాసురుడి కిరీటం మేడలోని బొచ్చు కుక్కపిల్ల గోడ దూకింది. ఆ కుర్రది పీడిస్తూంటే తప్పించుకుందుకు చేసే ప్రయత్నాలలో దూకడం అనుభవం మీద అలవడింది దానికి. గోడదాటి యివతలకు వచ్చాక విశాలంగా కనిపించింది ప్రపంచం. తన బొచ్చులాగి బాధించే కుర్రదాని బారినుండి తప్పించుకుందుకు ఆ కుక్కపిల్ల దారీతెన్నూ లేకుండా దూరంగా పారిపోతూనే ఉంది

